# దీపావళి దివ్యజ్యోతుల్లో

బసవరాజు రాజ్యలక్ష్మమ్మ

ఆళ్వారుపేట బస్సుస్టాపింగు దగ్గరగానున్న మర్రిచెట్టుకింద కూర్చుని మునుసామి పాతచెప్పులు కుట్టుతూవుండేవాడు.

మునుసామి కూతురు తాయారు తొమ్మిదేళ్ళపిల్ల తండ్రి దగ్గరగా కూర్చుని కుట్టుసామానులు అందిస్తూవుండేది. తాయారు నిజంగా మాదిగకులంలో పుట్టవలసిన పిల్లగాదు. యేదో శాపంవల్ల మాదిగకులంలో పుట్టిందనే నా నమ్మకం. తెల్లజామపండువంటి ఆ ఛాయా, ఆ చక్కని గుండ్రని ముఖము, చెంపకు చారెడుకళ్ళు, నల్లని వుంగరాలు, తిరిగిన జుట్టూ, ముద్దులు మూటగట్టినట్టుగా వుండేది, ఆ జుట్టుకు తైలసంస్కారము లేకపోయినాగూడాను.

భాగ్యవంతుల పిల్లల మాదిరిగా శుభ్రమైన గుడ్డలు, కడుపునిండాతిండీ, రోజూ స్నానము, తలదువ్వేవానివుంటే యింకా ఎంత చక్కగా వుండేదో అనుకునేదాన్ని. తాయారులో ఒక విధమైన ఆకర్షణశక్తి వున్నది.

నేను మొదటిసారి ఆళ్వారుపేట వెళ్ళినప్పుడు మళ్ళా తిరిగి వచ్చేటందుకు బస్సులు ఖాళీగా లేకపోవటంవల్ల ఆ మర్రిచెట్టుదగ్గర చాలాసేపు నించోవలసివచ్చినది. అప్పటినుండి నాకూ తాయారుకు బాగా స్నేహం కుదిరిపోయింది. నేను వెళ్ళినప్పుడల్లా ఆ తాయారుకు తినటానికి యేదైనాపెట్టి మాట్లాడించకుండా అడుగు అవతలకు పడేదేకాదు నాకు, అప్పటినుండి తాయారు నేను బస్సు దిగుతుండగానే చూచి నాదగ్గరకు పరుగెత్తుకుని వచ్చేది.

మునుసామి మాదిగకులంలో పుట్టినా మంచి స్వభావంగలవాడు, అమాయకుడు. నందనారుపాటలు పాడుకుంటూ పాత చెప్పులు కుట్టుకునేవాడు. పోయిన సంవత్సరం దీపావళిరోజునే తాయారు తల్లి కలరావచ్చి చచ్చిపోయిందనీ, ఈ పిల్లకోసమే తను మళ్ళా పెళ్ళిచేసుకోలేదని చెప్పేడు. తల్లి లేనిపిల్లని తల్లితండ్రీకూడా, తనే అనుకుని తాయారును అతి ప్రేమగా తన ప్రాణం కంటెగూడా ప్రేమగా చూచేవాడు. అయితే బీదవారికి ప్రేమవుంటే మాత్రం యేమిపెట్టగలరు? మునుసామికీ! తాయారుకుకూడా ఆకలితో మూరెడు లోతుకు పోయిన పొట్టలే, బొమికలు బయటపడ్డ శరీరాలే.

ఏమహానుభావులైనా అణాడబ్బులిచ్చి చెప్పులు కుట్టించుకుంటేనే వారికితిండి, లేకపోతే ఆ రోజపస్తే వాళ్ళకుపాపం. నాకూ

తాయారుకు బాగా దోస్తీ అయిపోయింది. నాకు బస్సు అందనపుడల్లా మళ్ళా బస్సు వచ్చేవరకు తాయారుచేత చిన్ని చిన్ని పాటలు పాడించటం, ఆ ముద్దు మాటలు వినటం, నాకు తోచింది. తినటానికి కొని పెట్టటం మామూలు అయిపోయింది.

ఒక రోజు మునుసామితో "మునుసామీ మీ తాయారును నాకిస్తావా ? మా శారదాని కేతనంలో చదివిస్తాను; పిల్ల కడుపు నిండా తిండి తిని బాగుపడుతుంది, చదువు కుంటుంది అన్నాను."

మునుసామి జాలిగా "అమ్మా నేను అసలు బ్రతకటం ఈ తాయారుకోసకే నమ్మా. నా తాయారు నాదగ్గర లేనిది ప్రపంచమంతాకూడా అంధకారంగా కనపడుతుంది" అన్నాడు.

బీదవారికి భాగ్యవంతులకు కూడా ప్రేమా, కడుపుతీపి ఒకటేగదా అనుకున్నాను. అయితే భాగ్యవంతులు తమ పిల్లలకు పెట్టినట్లు బీదవారు తమ పిల్లలకు కోరినతిండి, కోరినబట్టా యివ్వలేక పోవచ్చును.

మునుసామితో నేను మళ్ళా ఆ ప్రశంశ తేలేదు. నేను దీపావళి రేపనగా ఆళ్వారు పేట వెళ్ళేను. అప్పటికి నేను ఆళ్వారుపేట వెళ్లి వారంరోజులైనది, నేను బస్సుదిగగానే పరుగెత్తుకునివచ్చే తాయారు ఆ రోజురాకుండా తండ్రిఒళ్లోపడుకుని యేడుస్తున్నది. మునుసామికూడా కళ్లు గుంటలు పట్టి నీరసంగా వున్నాడు. తాయారు దగ్గరకువెళ్లి పలహారం చేతికిచ్చి "తాయారూ! యెందుకేడుస్తున్నావమ్మా" అని అడిగేను.

మునుసామి "అమ్మా యేమని చెప్పను మాకిది కొత్తగాదుగానీ మూడురోజులైనది తాయారు నేనూ గంజినీళ్లుకూడా తాగలేదు. మూడురోజులనుంచి ఒక అణా డబ్బులైనారాలేదు. పిల్లప్రాణం, నాప్రాణం కూడా శోషకొస్తున్నది-యేమిచెప్పమంటారమ్మా, మా అవస్థ! స్వరాజ్యం వచ్చిందంటారు; యేమికాంగ్రెసోనమ్మా, మా బీదవారి అతిగతీ కనుక్కునే వారుండరు. రేపు దీపావళిపండుగ; నా భార్యపేరుచెప్పి యేదైనాచేద్దామన్నా పూటకి గంజి నీళ్ళకే గతిలేనివాణ్ణి యేంచెయ్యను? భాగ్యవంతులకు రోజూ పండగే. ఈ తల్లిలేని పిల్లకు కొత్త బట్టలు, టపాకాయలు యివ్వలేను సరిగదా తిండి అయినా పెట్టలేను గదా. నేనుగూడా దాని తల్లితోపాటే పోయినట్టయితే మీబోటివారైనా పెంచేవారు" అనివాపోయినాడు. నా గుండె కరిగిపోయింది. ప్రపంచంలో తిండిలేక బీదవారు యిల్లా యెంతమంది బాధపడుతున్నారో గదా! భాగ్యవంతులు కోరిన తిండి, కోరినబట్టలు. మేడమీదకాలు కింద పెట్టకుండా కార్లల్లో, తిరుగుతుంటే బీద

వారికి గంజినీళ్ళకైనా గతిలేకుండావున్నది మన దేశంయొక్క దుర్దశ. దేశమంతా కూడా ఈ దీపావళికి తలంట్లుపోసుకుని కొత్త బట్టలు కట్టుకుని నవకాయపిండివంటలతో భోజనంచేసి టపాకాయలు కాల్చుకుంటుంటే ఈ మునుస్వామి, తాయారు యింకా యిల్లాంటివారు యెందరో పస్తుపడుకోటమా! భగవంతుడికి న్యాయాన్యాయాలు లేవు. ఒకమూల బొజ్జలునిండిన మార్వాడీ సేట్లు రూపాయలకు పూజలు చేస్తుంటే వేరొక మూల బీదవారు తిండికిలేక పస్తుపడుకోటమా? నాగుండె తరుక్కుపోయింది. అక్కడే దగ్గరవున్న హోటలులో తినటానికి పులుసన్నం పొట్లాలుకొని మునుసామికి, తాయారికిచ్చి తినమన్నాను. మునుసామి, తాయారు ఆకాస్త పులుసన్నం తిని నీళ్లు తాగేటప్పటికి ప్రాణంకాస్త తెప్పరిల్లుకున్నది పాపం. మునుసామి "నా ప్రాణానికేమిగాని అమ్మా, నా తాయారు ప్రాణం కాపాడేరమ్మా" అన్నాడు జాలిగా.

"రేపు పండగ—మీరు యింకేమీ పెట్టిపుట్టలేదు, కడుపునిండా గంజి అయినా తాగండి" అని చెప్పి అప్పటికి నాదగ్గరవున్న దేదో మునుసామి చేతిలోపెట్టి తాయారుతో "నేడో రేపో నీకొరకు గౌనూ, టపాకాయలు తెస్తాన" ని చెప్పి వెళ్లాను. దీపావళి రేపన గానే మబ్బు వర్షం ప్రారంభమైనది. దీపావళి పండగరోజు యెనిమిదిగంటలకల్లా తాయారుకొరకు ఒక గౌను టపాసులు, కొన్ని తినే వస్తువులు తీసుకుని తాయారును సంతోషపెట్టుటకు వర్షాన్ని కూడా లెఖ్ఖ చెయ్యకుండా ఆళ్వారుపేట వెళ్లాను. కాని ఆ చెట్టుదగ్గర మునుసామిగాని తాయారుగాని కనపడలేదు, ఆదుర్దాతో అక్కడవున్న కిల్లీషాపు నాయరును అడిగాను "తాయారు మునుసామి యింకా రాలేదా!" అని

నాయరు "అమ్మా నిన్న రాత్రి యేడు గంటలప్పుడు మునుస్వామి తాయారు తేనాంపేటలో వున్న వారి గుడిశకు పోతూవుండగా ప్రమాదవశమున ఒక జమీందారు గారి కారుట తాయారుమీదుగా పోయింది. తాయారు బ్రతికే స్థితిలో లేదు. వెంటనే జనరల్ ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. ఈపాటికి పోయేవుంటుంది" అని చెప్పేడు. నెత్తిన పిడుగుపడ్డట్టయినది ఆ మాట వినగానే. ఈ భాగ్యవంతులు కన్నుమిన్ను తెలియకుండా తిరుగుటగాక బీదవారిని బ్రతకనివ్వరు కూడా గాభోలు భగవంతుడా! అనుకుని వెంటనే బస్సుయెక్కి ఆస్పత్రికి వెళ్లేను.

తాయారు యేవార్డులోవున్నదీ యెవరు చెపుతారు? పేరు ప్రఖ్యాతులు జెందినవని చెపుతారా, వక ధనం వంతురాలని చెపుతారా! కొంతమంది నర్సులు నామాటే వినుపించుకోలేదు. నిన్న కారుకిందపడ్డ

అమ్మాయి యేవార్డులో వున్నదని అందరినీ అడిగాను. అందులో స్త్రీహృదయం గలిగిన ఒక నర్సు మాత్రం నన్ను తాయారు దగ్గరకు తీసుకొని వెళ్లినది. తాయారు కొన వూపిరితో అంతిమయాత్రకు సిద్ధంగా నున్నది. మునుసామి దగ్గర కూర్చుని గోల పెడుతున్నాడు. నన్నుచూడగానే "అమ్మా నీతాయారు యింక నాకు దక్కదు. ఏదో శాపంవల్ల ఆదేవలోకంలోనించి దిగి నా యింట్లో పుట్టింది - లేకపోతే అల్లాంటి పిల్ల నాయింట్లోపుట్టుటయేమిటి! నాకెల్లా దక్కుతుంది "అని యేడ్చేడు.

తాయారు చివరసారి కళ్ళు తెరిచి చూచింది. నా కోరకా ప్రాణం యింతవరకు నిల్చివున్నదన్నట్టుగాచూచి ప్రాణం వదిలింది. ఆ దృశ్యం ఎంతకఠినగుండెగలవాళ్లనుకూడా కరిగించకమానదు. అసలు ఈ తాయారు యెవరు? నేనెవర్ని? మూడు నెలల స్నేహంలో మా యిద్దరికి యింత ప్రేమ బంధం యేర్పడటం యేమిటి? లోకంలో యెంతమంది పిల్లలు లేరు! యెంతమంది చచ్చిపోవటంలేదు! ఈ తాయారు చచ్చిపోతే నాకింత విచారమెందుకుండాలి? మా యిద్దరికీ యేదో పూర్వజన్మ సంబంధం తప్పక వుండియుటుందనే నా నమ్మకం. నర్సులు ప్రాణిపోగానే మంచంమీదనుంచి తాయారుని తియ్యమని, లేకపోతే తామే తీసేస్తా మని గోలచేస్తున్నారు. నేను ఆ దృశ్యంచూడలేక వచ్చేశాను. మునుసామి పాపం 'నిరుడు దీపావళి తాయారు తల్లిని పొట్టన బెట్టుకుపోయింది. ఈ సంవత్సరం దీపావళి నా తాయారుని పొట్టన పెట్టుకు పోయింది' అని యేడుస్తున్నాడు. దీపావళి పండగ తాయారుమీదుగా పోయింది గాబోలు. పాపం దీపావళి ప్రజల నందరినీ సంతోష పెట్టినా మునుసామిని మాత్రం యేడ్పించి పోయింది.

—— (0) ——

## "మార్పు" — ప్రశంస

అక్టోబరు మాసపు గృహలక్ష్మిలో శ్రీ వై. వి. శర్మగారు వ్రాసిన "మార్పు" అన్న కథానికలోని ప్రత్యేక విశిష్టత ఏమంటే, తాత్కాలిక యావ్వనోద్రేకాలకులోనైన యొక అభాగిని జీవితం, చివరకు విషాదాంతంగా ఎలా పరిణమించిందో అన్న చిత్రణ, నిరూపించుటమే. సమాజంలోని సమస్యనొకదానిని కథావస్తువుగా గ్రహించి, రచించిన "మార్పు" వంటి కథానికలు మీ "గృహలక్ష్మి"కొక ప్రత్యేక అలంకరణ అని భావిస్తున్నాను.

రాచూరి లక్ష్మీనరసింహశాస్త్రి